కోకిలగొంతువోలె సన్ననై మధురమైన నీకంఠము శ్రవణ కఠోర మగుచున్న దేల ?

చిన్ననాఁటినుండి మనయాత్మలు ఒకచోట నుంచిన రెండు పువ్వుల వాసనవలెఁ గలిసిపోయినవి. ఆ రెండువాసనలను విడఁదీసిన ప్రజ్ఞాశాలి యెవఁడోయి !

తమ్ముఁడా ! ఒక్కసారి నన్నుఁ గౌఁగిలించుకొనుము

గౌతముఁడు : ఇట్టి యనునయములచేత, నిట్టి ప్రేమప్రకటనలచేత మరి నాతలఁపులు నీవు వశపరచుకొనలేవు. ఇన్నాళ్లంధుఁడనై నీసిద్ధాంతములు నిజములని నమ్మితిని. ఆర్య ఋషులు వ్రాసిన వ్రాఁతలు నీవు చదువలేదు. నన్నుఁ జదువ నీయలేదు. పైఁగ వారి యూహ లన్నియు తప్పు లందువు

తతబహుజన్మలబ్ధసుకృతంబులప్రోవులు, యోగనిష్ఠ ను
గ్రతపము రూపుగొన్న స్మృతికర్తలు మూర్ఖులు; నీ వొకండవు పం
డితుఁడవు; వారివాదములు నిల్వవు; నేలకు ఱేఁడవైన నీ
జతనము మాను నెల్ల శిరసాపరిధార్యము వేనభూమిపా!

వేనుఁడు : [కోపము]

గౌతముఁడు : నీకుఁ గోపము వచ్చిన నాకు భయము లేదు. పారాశరికివలె, భార్గవునికివలె, నౌశనసునికివలె నీ వన్న నాకు భయము లేదు. లోకము నీ యూహలప్రకారము నడచెనేని ప్రళయము రేపే వచ్చును. లోకకంటకములైన యీ యూహలతో నీ యీ సిద్ధాంతములతో జగ మ్మెల్ల సంక్షోభించి పోవుచున్నది

వేనుఁడు : అట్లనా! ఓయీ! దీనిని బిశాచమును గానీకుము దీనిని దీసికొనిపోయి కోటయవ్వలిచీకటిగదిలో నుంచుము. వేళకు భోజనము పెట్టుము. దానిబంధువులు చనిపోలేదు, బ్రతికియే యున్నారని చెప్పుము

ద్యాపీతకుఁడు : [నిష్క్రమించును]

గౌతముఁడు : వేనా!

వేనుఁడు : ఏమి?

గౌతముఁడు : తక్కినవారందరు పిశాచములైనారా యేమి?

వేనుఁడు : నేనే పిశాచమను. నాకు వేరే పిశాచములెందుకు? నే నింకఁ బోదునా? నాకుఁ బని యున్నది. నీవు రేపురాత్రికి వత్తువుకదా! మరచిపోకుము [నిష్క్రమించును]

గౌతముఁడు : ఇతఁడెన్నడెఱుఁగని భయమేదియో యితని నావరించినది. అది యేమైయుండును? వేనునియీభయమునకు హేతువేమి? హిమవంతమువంటిధైర్యముగల వేనుఁడు భయపడెనా? కారణమేదియో పెద్దదే యుండవలయును

[తెర]

